సాక్షి నారాయణపేట

బుధవారం। 12। ఏప్రిల్। 2023



ఆరోగ్య ప్రదాతలు

వేసవి తాపానికి ఆకలి తీర్చడంతోపాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది అంబలి.

వివరాలు 8లో ▸



తుది దశకు వంతెన పనులు

సీసీకుంట, చిన్నవడ్డెమాన్ మధ్య మన్నెవు వాగుపై వంతెన పనులు చివరిదశకు చేరాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
39.5 /26.5

వాతావరణం

రోజంతా ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం తీవ్రత పెరుగుతుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమయ్యే అవకాశం ఉంది.



న్యూస్‌రీల్

నేటి నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

నారాయణపేట రూరల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల విభాగం అధికారులు ఇచ్చిన షెడ్యూల్డ్ ప్రకారం 1 నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ పరీక్షలను నాలుగు రోజుల్లో పూర్తి చేస్తారు. దీనికి పాఠశాలలోనే సొంతంగా ప్రశ్నాపత్రం సిద్ధం చేసుకున్నారు. అదేవిధంగా 6 నుంచి 9వ తరగతి వరకు ప్రశ్నాపత్రాలను డీసీఈబీ తయారు చేసి, సంబంధిత ఎమ్మార్సీల ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకుల అన్నిరకాల పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా అందజేసింది. జిల్లాలో 22 ప్రభుత్వ, 404 మండల పరిషత్, 70జెడ్పీ పాఠశాలలతో పాటు నాలుగు ఎయిడెడ్, 140 ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. 1 నుంచి 9వ తరగతి వరకు 87,250 మంది చిన్నారులు పరీక్షలకు హాజరు కానున్నారు. మొదటి పరీక్ష గణితం సమయంలో మార్పు చేశారు. బుధవారం జిల్లాలోని కొన్ని ఉన్నత పాఠశాల కేంద్రాల్లో టెన్త్ ఒకేషనల్ పరీక్ష జరుగుతున్నందున 6 నుంచి 9వ తరగతి ఎస్‌ఏ-2 పరీక్ష మధ్యాహ్నం నిర్వహిస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో రాణించాలి



నారాయణపేట రూరల్: అథ్లెటిక్స్‌లో క్రీడాకారులు రాణించి ఈ ప్రాంతానికి చక్కటి పేరు తేవాలని డీవైఎస్‌ఓ కృష్ణమాచారి అన్నారు. వేసవి సందర్భంగా మినీస్టేడియం గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలురకాల క్రీడలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు మంగళవారం శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 6గంటలకు మొదలవుతుందని, విద్యార్థులు, యువత పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రమణ, అమరీష్, నందు పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు



నారాయణపేట రూరల్: పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. జిల్లాలోని 38 కేంద్రాల్లో మంగళవారం సాంఘిక పరీక్షకు 7,538 మంది హాజరయ్యారు. 31మంది గైర్హాజరయ్యారు. దీంతో 99.59శాతం హాజరు నమోదైంది. అదేవిధంగా ఒక ప్రైవేటు కేంద్రంలో ఇద్దరికి గాను ఒక్కరే హాజరయ్యారు. డీఈఓ లియాకత్‌అలీ నర్వ, పులిమామిడి, పెద్ద కడ్మూర్, మాగనూర్, కృష్ణ సెంటర్లను తనిఖీ చేశారు. అదేవిధంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఎంఈఓ వెంకటయ్య బృందం ఊట్కూర్, నారాయణపేట, దామరగిద్ద మండలాల్లోని కేంద్రాలను తనిఖీ చేశారు.

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

పాలమూరు: మహబూబ్‌నగర్ డిపో పరిధిలోని ఆర్టీసీ సమస్యలపై బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్ డిపో పరిధిలోని ఆర్టీసీకి సంబంధించిన ఏదైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే 99592 26286 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చని సూచించారు.

పల్లె వైద్యం అందని ద్రాక్షే



మరికల్ పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న ఏఎన్‌ఎం

గ్రామాల్లో జ్వరం వస్తే పీహెచ్‌సీలకు పరుగులు

- ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలతో సేవలు
- పల్లె డాక్టర్లకు 'కంటివెలుగు' బాధ్యతలు

మరికల్: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె దవాఖానాల్లో వైద్యం అందడంలేదు. ఈ ఏడాది జనవరిలో చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమానికి ప్రత్యేక వైద్యులను నియమించకుండా పల్లె దవాఖానాలు, పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యాధికారులను కేటాయించారు. దీంతో సిబ్బంది లేక గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు నిలిచిపోయాయి. ఫలితంగా పాతరోజులే వచ్చాయంటున్నారు గ్రామీణులు. చిన్నపాటి జ్వరమొచ్చినా దూర ప్రాంతంలోని పెద్దఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.



తీలేర్‌లో డాక్టర్ లేని ఆరోగ్య ఉపకేంద్రం

ముగ్గురే రెగ్యులర్ వైద్యులు..

జిల్లాలో 11 పీహెచ్‌సీల పరిధిలో 87 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వాటిలో 25 ఆరోగ్య ఉపకేంద్రాలను మొదటి విడతగా పల్లె దవాఖానాలుగా అభివృద్ధి చేయడానికి గుర్తించారు. పల్లె దవాఖానాలు అమల్లోకి వచ్చిన తర్వాత జిల్లాలో పులిమామిడి, గుండుమాల్, మాగనూర్ పీహెచ్‌సీల్లో మాత్రమే రెగ్యులర్ వైద్యులు ఉన్నారు. వీరు తమ పీహెచ్‌సీ పరిధిలో కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొంటూ, ఇటు రోగులకు కూడా వైద్యసేవలు అందిస్తున్నారు. మిగతాచోట్ల మాత్రం పల్లె దవాఖానాల వైద్యులే కంటివెలుగు శిబిరాలను నిర్వహిస్తున్నారు. ధన్వాడ మండలంలోని కిష్టాపూర్ పల్లెదవాఖానా వైద్యుడిని ధన్వాడ పీహెచ్‌సీకి డిప్యూటేషన్ ఇచ్చారు. దీంతో కిష్టాపూర్‌లో సిబ్బంది లేక రోగులకు వైద్య సేవలు అందడంలేదు. కంటివెలుగు శిబిరాలు ఈ ఏడాది జూన్ వరకు కొనసాగే అవకాశం ఉంది. అప్పటివరకు పరిస్థితి ఇంతేనా అని రోగులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు మారుమూల గ్రామాల్లో పని చేయడానికి వైద్యులు ఆసక్తి చూపడంలేదు. ఈ కారణంగానే పల్లె జనానికి మెరుగైన వైద్యం అందని ద్రాక్షగా మారింది. మక్తల్, నారాయణపేట, నర్వ, దామరగిద్ద, మద్దూర్ తదితర మండలాల్లోని పల్లె దవాఖానాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

ఏఎన్‌ఎంలతో సేవలు అందిస్తున్నాం..

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులలో, పల్లె దవాఖానాల్లో వైద్యుల కొరత ఉంది. కంటివెలుగు కార్యక్రమం ముగిసిన తర్వాత ఎవరిస్థానంలో వారిని కేటాయిస్తాం. మరికల్ పీహెచ్‌సీకి త్వరలోనే రెగ్యులర్ డాక్టర్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం పల్లె దవాఖానాలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తల సహకారంతో రోగులకు వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ రాంమనోహర్‌రావు, డీఎంహెచ్‌ఓ

మరికల్ ఇన్‌చార్జ్ డాక్టర్ సస్పెన్షన్

మరికల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు రాఘవేంద్రరెడ్డికి మాగనూర్ పల్లె దవాఖానా బాధ్యతలు అప్పగించారు. తీలేర్ పల్లె దవాఖానా వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న డా.రాకేష్‌కు మరికల్ పీహెచ్‌సీ బాధ్యతలు అప్పగించారు. 24గంటల ఆస్పత్రిలో తరచూ విధులకు డుమ్మా కొడుతూ, ఆస్పత్రిలో కేవలం గంటసేపే ఉంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. అంతేకాకుండా ఈయన దేవరకద్రలో ప్రైవేట్ క్లినిక్ ఏర్పాటు చేసుకున్నారని, దీంతో మరికల్ పీహెచ్‌సీకి వచ్చిన ఓపీ రోగులను దేవరకద్రలో తన క్లినిక్‌కు రప్పించుకుంటున్నారని సమాచారం. ఈ విషయం కూడా కలెక్టర్ దృష్టికి వెళ్లిందని తెలిసింది. గతనెల 31న కలెక్టర్ మరికల్ పీహెచ్‌సీని సాయంత్రం 4.30 గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో డాక్టర్ లేకపోవడంతో వెంటనే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మరికల్, తీలేర్ పల్లె దవాఖానాల్లో వైద్యుడు లేక రోగులకు వైద్య సేవలు అందడంలేదు. మరికల్‌లో ఏఎన్‌ఎం ఓపీ, గర్భిణులకు వైద్యం చేస్తున్నారు.

మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్ కేసీఆర్ ఘనతే



మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



నూతన చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపడుతున్న మోసటి జ్యోతి

- తొలి దళిత మహిళా చైర్‌పర్సన్ జ్యోతి కావడమే నిదర్శనం
- అట్టహాసంగా నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం
- మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆరే
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

నారాయణపేట: దేశ చరిత్రలో వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు అయినా కృష్ణా, గోదావరి నీటి వాటా తేల్చడం చేతగాని కేంద్ర ప్రభుత్వం దేశాన్ని ఉద్ధరిస్తుందంట. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను, రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందంటూ కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తారు. నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డితో పాటు మంత్రి నిరంజన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా యాసంగిలో రూ.95లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని, ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే 56.44 లక్షల ఎకరాల్లో వరి సాగు అయ్యిందంటే.. ఇది తెలంగాణ వ్యవసాయరంగ ఖ్యాతి అన్నారు. రాష్ట్రంలోని 65లక్షల రైతు కుటుంబాలకు రైతుబంధు సాయం అందిస్తున్న మనగాడు సీఎం కేసీఆర్ అన్నారు. ఒక్క నారాయణపేట నియోజకవర్గంలోని రూ.596 కోట్లు రైతు బంధు అందిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే ఏమొస్తది అనే దానికి.. నారాయణపేట మార్కెట్ యార్డుకు నేడు ఓ దళిత, చదువుకున్న యువతి మోసటి జ్యోతి చైర్‌పర్సన్ కావడమే నిదర్శనమన్నారు. ఈ కారణంగానే మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జ్యోతిరావు పూలే జయంతి రోజు పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవం శుభదినమని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పేటలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ క్లాసులు ప్రారంభమవుతాయని, నారాయణపేట జాయమ్మ చెరువుకు సాగునీరు అందిస్తామని అన్నారు.

అబ్‌కీ బార్.. కిసాన్ సర్కార్

సీఎం కేసీఆర్ నేతృత్వంలో దేశంలో రాబోయేది అబ్‌కీ బార్.. కిసాన్ సర్కార్. నవభారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నాంది పలకాలని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో రిజర్వేషన్‌ల అమలును తీసుకురావడంతోనే మొట్టమొదటిసారిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పుణ్యమా అంటూ నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎస్సీ మహిళ బాధ్యతలు చేపట్టారని, ఇది దళితజాతికే గర్వకారణమన్నారు. కేంద్రాన్ని ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. లీకేజీలను ప్రోత్సహించేందుకు, దాడులను ప్రేరేపించేందుకు మోదీ తెలంగాణ పర్యటనకు వచ్చారా అని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, శాట్ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ, ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇది ఆరంభమే..



సమావేశంలో మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

- ఉమ్మడి పాలమూరులో 13 స్థానాల్లో బీఆర్‌ఎస్ వ్యతిరేక శక్తులే గెలుస్తారు
- అక్రమాలపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా?
- నేను తలవంచే అవకాశం ఎవరికీ ఇవ్వలేదు
- కొల్లాపూర్‌లో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రభుత్వంలో కొనసాగుతున్న అక్రమాలను ప్రశ్నించినందుకే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్‌లో మంగళవారం విలేకరులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందడం లేదని విమర్శించారు. తెలంగాణ వద్దన్నోళ్లు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ఆపాలని చూసినవాళ్లను పార్టీలో చేర్చుకున్నారని మండిపడ్డారు. గతంలో చేసిన కాంట్రాక్టులో రూ.5లక్షలు పెండింగ్‌లో ఉంటే ప్రభుత్వమే రూ.26కోట్లు ఇప్పించిందని ఆరోపించారు. ఏళ్లుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్న సర్పంచులకు ఎందుకు నిధులు మంజూరు చేయడం లేదని ప్రశ్నించారు. మాజీ ఎంపీ పొంగులేటి ఆహ్వానించడంతోనే ఆత్మీయ సమ్మేళనానికి వెళ్లానని, రాజ్యాంగం ఇచ్చిన హక్కు ప్రకారం ఎక్కడికైనా వెళ్లేందుకు, మాట్లాడేందుకు స్వేచ్ఛ ఉందని చెప్పారు. ప్రభుత్వ అక్రమాలపై ప్రశ్నించినందుకు తనపై సస్పెన్షన్ విధించారని, దాంతో ప్రజల్లో తనకు మరింత గౌరవం పెరిగిందన్నారు. ఇప్పుడు ప్రజలకు అన్ని విషయాలు చెప్పుకునే అవకాశం కలుగుతోందని వ్యాఖ్యానించారు. సమైక్య రాష్ట్రంలోనూ అధికార పార్టీతో పోరాటం చేసి శ్రీశైలం గేట్లు మూయించామని చెప్పారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉన్న తన అనుచరులపై పోలీస్ కేసులు పెట్టి ఎన్నికల్లో పోలింగ్ ఏజెంట్లు లేకుండా చేయాలనే కుట్ర సాగుతోందని వివరించారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న అక్రమాలపై మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. నియోజకవర్గ పరిస్థితులపై మంత్రి నిరంజన్‌రెడ్డికి చెప్పుకుందామన్నా ఏనాడూ పలకరింపునకు నోచుకోలేదని వివరించారు. తన అనుచరులను ఎన్ని వేధింపులకు గురిచేసినా వారు తలలు వంచరని, సమయం వచ్చినప్పుడు మీ మెడలే వంచుతారని చెప్పారు.

వనపర్తిలో పీఠం కదులుతోంది

కేఎల్ఐ ప్రాజెక్టును 3.50 లక్షల సామర్థ్యానికి తాను మంజూరు చేయించకపోతే నీకు ఆ పేరెలా వచ్చేదో చెప్పాలని నిరంజన్‌రెడ్డిని డిమాండ్ చేశారు. ఉద్యమ సమయంలో మీపై ఎన్ని కేసులున్నాయో చెప్పాలన్నారు. వనపర్తిలో పీఠం కదులుతోందని, ఇది ఆరంభం మాత్రమేనని జూపల్లి వ్యాఖ్యానించారు. ఎప్పుడైనా సర్పంచు, ఎంపీటీసీగానైనా గెలిచిన చరిత్ర ఉందా? అని ప్రశ్నించారు. తనపై తప్పుడు కూతలు కూస్తూ, అబద్దాలు మాట్లాడితే వడ్డీతో సహా వసూలు చేస్తానని హెచ్చరించారు. తానెవరికి తలవంచే అవకాశం ఇవ్వలేదని చెప్పారు. వనపర్తిలోనే మంత్రి నిరంజన్‌రెడ్డి బండారం బయటపెడతానంటూ సవాల్ విసిరారు. తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణను ప్రజలే నిర్ణయిస్తారని, వారి ఆశీస్సుల మేరకే ముందుకు సాగుతానని స్పష్టం చేశారు.

సర్వమతాల పేదలకు సీఎం చేయూత

నారాయణపేట: సర్వమత నిలయం తెలంగాణ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సర్వమతాల పేదలకు చేయూత అందిస్తున్నదని స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని నారాయణపేట నియోజకవర్గానికి రెండువేల తోఫా ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం తరఫున ఇఫ్తార్ విందును ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది ఏప్రిల్ 17న ఏర్పాటు చేస్తామని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాంచందర్‌నాయక్, సీపీఓ గోవింద్‌రాజన్, తహసీల్దార్ దానయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, వైస్ చైర్మన్ హరినారాయణ భట్టడ్, ఎంపీపీ అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ అంజలి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహనీయుడు జ్యోతిబా పూలే



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట: దేశంలో మహిళలు చదువుకోవాలని ముందుగా తన సతీమణిని పంతులమ్మను చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబా పూలే అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పార్లమెంట్ సభ్యులు మన్నే శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వనజ, నారాయణపేట ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి తదితరులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి కలెక్టర్ శ్రీహర్ష, జెడ్పీ చైర్‌పర్సన్ వనజ పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూలే వితంతు వివాహాలను ప్రోత్సహించారని, సతీసహగమన దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి క్రిష్ణమచారి, సీపీఓ గోవిందరాజన్ తదితరులు ఉన్నారు.

పే స్కేల్ మాకేది?



కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డికి ఇటీవల వినతిపత్రం అందజేస్తున్న ఉపాధి ఉద్యోగులు

- ఉపాధి హామీ ఉద్యోగుల ఎదురుచూపులు
- జిల్లాలో 97 మంది ఉద్యోగులు 145 ఎఫ్‌ఏలు

మద్దూరు: గ్రామీణాభివృద్ధి శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధి హామీ ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేస్తూ జీవో జారీ చేసిన సర్కారు.. అదే శాఖలో పనిచేస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులను పట్టించుకోకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకూ పేస్కేల్ ఇవ్వాలని కోరుతున్నారు. జిల్లా సెలెక్షన్ కమిటీ ద్వారా 2006లో ఉపాధి హామీ పథకంలో సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ప్రోగ్రాం అధికారులు, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే రాతపరీక్ష, ఇంటర్వ్యూ, రోస్టర్ పద్ధతులు పాటిస్తూ నియామకాలు చేపట్టినా.. ఇప్పటికీ కాంట్రాక్టు పద్ధతిలోనే కొనసాగిస్తున్నారు.

జిల్లాలో 97మంది..

జిల్లాలో ఉపాధి హామీ పథకంలో ఏడుగురు ఏపీఓలు, ఈసీలు 6, కంప్యూటర్ ఆపరేటర్లు 31, హెచ్‌ఆర్ మేనేజర్ 1, ప్లాంటేషన్ మేనేజర్1, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ 1, టీఏలు 50 మంది పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సెర్ప్ ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటించడంతో ఉపాధి హామీ ఉద్యోగులు సైతం ఆశతో ఉన్నారు. తమ సర్వీసును క్రమబద్ధీకరించి, పేస్కేల్ ఇవ్వాలని కోరుతున్నారు. ఇదే డిమాండ్‌తో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు వినతిపత్రాలు ఇస్తున్నారు.

అన్నింటా ముందున్నా..

ఉపాధి హామీ ఉద్యోగులు హరితహారం, పల్లెప్రగతి, పల్లెప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికల నిర్మాణం, చెరువుల పూడికతీత పనులు, రోడ్లకు ఇరువైపులా ప్లాంటేషన్, ఫార్మేషన్ రోడ్లు, భూమి అభివృద్ధి పనులు, స్వచ్ఛభారత్, పాంపండ్స్, క్యాటిల్ షెడ్లు తదితర కార్యక్రమాల అమలులో ముందున్నారు. దీంతో గ్రామీణాభివృద్ధి శాఖకు ఎన్నో అవార్డులు వచ్చాయి.

145 ఎఫ్‌ఏలు..

క్షేత్రస్థాయిలో కూలీలకు మొబిలైజ్ చేసి వారికి పని కల్పించడం, పని చేయించడం, తదితర పనులను క్షేత్ర సహాయకులు చేస్తున్నారు. గతంలో సమ్మె కారణంగా వారిని దూరం పెట్టిన ప్రభుత్వం, గతేడాది ఆగస్టు 11 నుంచి విధుల్లోకి తీసుకుంది. పేస్కేల్ అమలు చేస్తే వీరికి కూడా లాభం జరుగనుంది.

వాటర్‌షెడ్ నుంచి ఉపాధి హామీలోకి..

నీటి సంరక్షణ కోసం కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టినా వాటర్‌షెడ్ 1998లో ప్రారంభించారు. అప్పటి నుంచి గ్రామాల్లో నీటి సంరక్షణ పనులు చేపట్టారు. నాలుగున్నరేళ్ల క్రితం వాటర్‌షెడ్‌లో పనిచేసే వారిని కూడా డిప్యూటేషన్‌పై ఉపాధి హామీ పథకంలో పనిచేయిస్తున్నారు. జిల్లాలో వీరు 1 పీఓ ఐఅండ్‌సీబీ, 2 జేఈ, 8 టీఏలు, 2 కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. 1998లో ఇద్దరు జేఈలో జిల్లాలో వాటర్‌షెడ్ కార్యక్రమంలో పని చేస్తున్నారు. మిగితా వారందరూ 2009 ఈ పథకంలో పని చేయడానికి వచ్చారు.

ఏళ్లుగా పనిచేస్తున్నాను..



1998లో వాటర్‌షెడ్ ఏర్పడినప్పటి నుంచి జేఈలో ఈ పథకంలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నాం. వాటర్‌షెడ్ నుంచి నాలుగున్నరేళ్ల క్రితం ప్రభుత్వం మాకు ఉపాధి హామీలోకి డిప్యూటేషన్‌పై పంపించారు. ఇన్నేళ్లుగా పనిచేస్తున్నా మాకు పేస్కేల్ అమలుకాలేదు.

– జయప్రకాష్‌రెడ్డి, ఉపాధి ఈసీ, మద్దూరు

మాకు న్యాయం చేయాలి



ఇటీవలే ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులకు కల్పించిన పేస్కేల్ అమలను మాకు కూడా వర్తింపజేయాలి. దాదాపు 17ఏళ్లుగా ఎలాంటి ప్రమోషన్లు లేకుండా చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నాం. మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ఎమ్మెల్యేలను, మంత్రులకు కలుస్తున్నాం.

– చంద్రశేఖర్, ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్

ఇసుక ట్రాక్టర్‌లు పట్టుకొని వదిలేశారు

కోస్గి: అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ స్థానికంగా నియంత్రించాల్సిన అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఇసుక అక్రమ దందా జోరుగా కొనసాగుతోంది. సోమవారం అర్ధరాత్రి పట్టణంలో ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు వారితో బేరం కుదుర్చుకొని వదిలేసిన సంఘటనే ఇందుకు నిదర్శనం. పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో అక్రమదందా సాగిస్తున్నాయనే సమాచారంతో పెట్రోలింగ్ వాహనంలో వెళ్లి మహబూబ్‌నగర్ రోడ్డులో బహార్‌పేట సమీపంలో ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఈ తతంగమంతా నడిరోడ్డుపై నడిపించడంతో అటుగా వెళ్తున్న కొందరు గమనించి ఫోన్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. బేరం కుదుర్చుకున్న పోలీసులు తమ పెట్రోలింగ్ వాహనంతో స్టేషన్‌కు, పోలీసుల చెర నుంచి విడిపించుకున్న అక్రమ ఇసుక ట్రాక్టర్లు తమతమ స్థానాల్లో ఇసుకను డంప్ చేసి గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపోయాయి.



రోడ్డు పక్కనే ఇసుక ట్రాక్టర్, పోలీసు వాహనం

మా నోటీసుకు రాలేదు..

పట్టణ పరిధిలో సోమవారం అర్ధరాత్రి ఎలాంటి ఇసుక ట్రాక్టర్లు పట్టుకోలేదు. సోమవారం రాత్రి సిబ్బంది పెట్రోలింగ్ వాహనంలో గస్తీ తిరిగి ఉంటారు. పట్టుకున్న అక్రమ ఇసుక ట్రాక్టర్ల విషయం మా నోటీసుకు రాలేదు. విషయం తెలుసుకుంటా.

– శ్రీనివాసులు, ఎస్సై, కోస్గి

క్లుప్తంగా

యువకుడిపై పోస్టుమాస్టర్ దాడి

మహమ్మదాబాద్: తమకు వచ్చిన కొరియర్ తెచ్చి ఇవ్వరా అని అడిగిన యువకుడిపై పోస్టు మాస్టర్ దాడిచేసిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కావటి రాజుకు మహమ్మదాబాద్ పోస్టాఫీస్ నుంచి కొరియర్ వచ్చిందని ఫోన్ చేశారు. పోస్టాఫీస్‌కు వచ్చి తీసుకెళ్లాలని తెలిపారు. దీంతో కొరియర్ తీసుకువచ్చేందుకు వెళ్లిన రాజు కొరియర్ తీసుకున్న తరువాత లెటర్లు, కొరియర్లు డోర్ డెలివరీ చేయరా సార్ అని ప్రశ్నించాడు. దీంతో కోపోద్రిక్తుడైన పోస్టుమాస్టర్ వాహిద్ దుర్భాషలాడుతూ కుమారుడితో కలిసి రాజుపై దాడిచేసి గాయపర్చారు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా, పోస్టాఫీస్‌కు వెళ్లిన వారిని ఇలాగే సదరు పోస్టుమాస్టర్ బెదిరించి మాట్లాడుతున్నట్లు పలువురు చెబుతున్నారు.

గుండెనొప్పితో ఉపాధి కూలీ మృతి


లోక్యానాయక్ (ఫైల్)

నవాబుపేట: ఉపాధి హామీ పథకంలో కూలీ పనిచేస్తూ ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కొత్తపల్లితండాలో చోటుచేసుకుంది. వివరాలిలా.. కొత్తపల్లితండాకు చెందిన లోక్యానాయక్(41) మంగళవారం గ్రామంలో కొందరు కూలీలతో కలిసి ఉపాధి పనికి వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా అకస్మాత్తుగా గుండెలో నొప్పి రావడంతో కిందపడిపోయాడు. దీంతో తోటి కూలీలు అతన్ని చౌడాపూర్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. లోక్యానాయక్‌కు భార్యతోపాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

విద్యార్థి బలవన్మరణం


వినయ్ (ఫైల్)

ధరూరు: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు పురుగుమందు తాగి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని అల్వలపాడు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రవిప్రకాష్, నాగమ్మ దంపతులకు ఇద్దరు కుమారుడు, కూతురు ఉన్నారు. వారిలో పెద్దవాడు వినయ్(23) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం నొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో ఉన్న పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11.30కు మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, వేమారెడ్డి, గోవిందు పరామర్శించారు.

కుక్కలదాడిలో గాయాలు


కుక్కల దాడిలో గాయపడిన బాలకిష్టయ్య

అడ్డాకుల: కుక్కల దాడిలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మూసాపేట మండలం సంకలమద్దిలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గట్టు బాలకిష్టయ్యగౌడ్ స్థానిక కల్లు దుకాణంలో పని చేసి సోమవారం రాత్రి తన ఇంటికి వెళ్తున్నాడు. ఇంటికి కొంత దూరంలో కొన్ని కుక్కలు ఉన్నట్లుండి బాలకిష్టయ్యపై దాడికి దిగాయి. కుక్కల నుంచి తప్పించుకునే క్రమంలో కిందపడిపోవడంతో కుక్కల దాడి మరింత ఎక్కువైంది. వాటికి మరికొన్ని కుక్కలు తోడై కాళ్లు, చేతులపై కరిచాయి. దీంతో తీవ్రగాయాలై రక్తస్రావమైంది. చేతులు, తొడల భాగాల్లో చర్మం ఊడేలా కొరికాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమికొట్టారు. 108కు సమాచారం ఇచ్చి బాధితుడిని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంగళవారం ఉదయం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా, వారం కిందట ఆయన భార్యపై కుక్కలు దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, కుక్కలను అరికట్టే విధంగా చర్యలు చేపడతామని సర్పంచ్ స్వరూప తెలిపారు.

కుక్కలదాడిలో గొర్రెపిల్లలు మృతి



జడ్చర్ల: మండలంలోని పెద్దపల్లిలో మంగళవారం గ్రామ శివారులో 11గొర్రె పిల్లలను చంపేశాయి. దీంతో తమకు తీరని నష్టం సంభవించిందని బాధితులు తిరుపతయ్య, సోమ య్య, శ్రీనివాసులు వాపోయారు. తహసీల్దార్, పశువైద్యాధికారికి ఫిర్యాదు చేశామని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్య ప్రదాతలు

- అంబలి కేంద్రాల ఏర్పాటులో యువత, సేవా సమితులు
- తీలేర్‌లో 40 ఏళ్లుగా పంపిణీ
- మరికల్‌లో 20 ఏళ్లుగా అయ్యప్ప సేవా సమితి..
- ఎండల నుంచి ఉపశమనం కలిగిస్తున్న దాతలు


తీలేర్ స్టేజీ వద్ద బాటసారులకు అంబలి అందిస్తున్న రాములమ్మ

మరికల్: వేసవి తాపానికి ఆకలి తీర్చడంతో పాటు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది అంబలి. ప్రస్తుత జీవన విధానంలో చిరుధాన్యాలకు ఎంతో ప్రాముఖ్యత ఏర్పడింది. చిరుధాన్యాల్లో రాగులు కూడా ప్రధానమైనవి. ముఖ్యంగా వేసవిలో హైడ్రేషన్ కారణంగా అనారోగ్యం పాలుకాకుండా చాలా మంది ఇళ్లలో రాగి పిండితో అంబలి తయారు చేస్తారు. ఈ నేపథ్యంలో వివిధ పనుల నిమిత్తం పట్టణాలు, వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలకు కొన్ని సేవా సంస్థలు.. కొందరు వ్యక్తులు ఏర్పాటు చేస్తున్న అంబలి కేంద్రాలు ఎంతో బాసటగా నిలుస్తున్నాయి. ఎండలో తిరిగి అలిసిన వారికి ఉపశమనం కలిగించడంతో పాటు ఆరోగ్యానికి మేలు చేసే విధంగా అంబలి కేంద్రాలు ఉపయోగపడుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలోనే మొదటి అంబలి కేంద్రం..

తీలేర్‌లో దివంగత మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేస్తున్న అంబలి కేంద్రం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే మొట్టమొదటిది. దివంగత మాజీ ఎమ్మెల్యే కె.వీరారెడ్డి తండ్రి వెంకారెడ్డి తీలేర్ సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత ఇక్కడి ప్రాంత ప్రజల జీవన స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని 1981 సంవత్సరం నుంచి ప్రతి యేటా తీలేర్ స్టేజీ వద్ద రాగి అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులు, ప్రజల దాహం తీర్చారు. తండ్రి మరణం అనంతరం ఈ బాధ్యతను వీరారెడ్డి కొనసాగించారు. ఆయన మరణానంతరం ప్రస్తుతం వీరారెడ్డి కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అంబలి కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు.


మరికల్‌లో ఉపాధి కూలీలకు అంబలి పోస్తున్న అయ్యప్ప భక్తులు

20ఏళ్లుగా అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో 20 ఏళ్లుగా అంబలి కేంద్రం ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ప్రతి ఏడాది అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా స్వచ్ఛందంగా అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహాన్ని తీరుస్తున్నారు.

తాతయ్య జ్ఞాపకార్థం..



1981లో వ్యవసాయ కూలీలు, రైతుల కోసం మా తాతయ్య వెంకారెడ్డి ప్రారంభించిన అంబలి కేంద్రాన్ని అలాగే కొనసాగిస్తున్నాం. తమ తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి 35ఏళ్లు కొనసాగించారు. ఇకముందు కూడా అంబలి కేంద్రాన్ని ప్రతియేటా నిర్వహిస్తాం. – కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, తీలేర్

అయ్యప్ప అనుగ్రహంతో..



అయ్యప్పస్వామి అనుగ్రహంతో అయ్యప్ప సేవా సమితి స్థాపించిన నాటి నుంచి బాటసారుల, ప్రయణికుల దాహర్తి కోసం అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. అంబలి కేంద్రాన్ని ఎలాంటి ఇబ్బంది లేకుండా 20ఏళ్లుగా కొనసాగిస్తున్నాం. – సతీష్‌కుమార్, అయ్యప్ప భక్తుడు, మరికల్

విదేశీ విష సంస్కృతి వీడాలి


మాట్లాడుతున్న కమలానంద భారతిస్వామి

కమలానంద భారతిస్వామి

నారాయణపేట టౌన్: ప్రతి హిందువు తమ శక్తి రూపాలైన దేవీ దేవతలను ఆధ్మాతిక భక్తి భావనతో సర్మిస్తూ.. ధర్మరక్షణ, దేశభక్తి పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని భువనేశ్వరి పీఠాధిపతులు పరహంస కమలానంద భారతిస్వామి అన్నారు. దేశంలో ప్రధానంగా విదేశీ సంస్కృతిని విడనాడాలని కోరారు. సంత్ మత మూల మహా సంస్థానం, శక్తిపీఠం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచనంలో శక్తిపీఠం వ్యవస్థాపకులు స్వామీజీ శాంతానంద పురోహిత్ మాట్లాడుతూ కమలానంద భారతిస్వాములు జగద్గురు శంకచార్యులు యాదత్ భారతదేశంలో ధర్మం, సత్యం, పాటిస్తూ ఎన్నో శక్తిపీఠాలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. అలాగే కమలానంద భారతి స్వామి ఎన్నో ఏళ్ల నుంచి పాదయాత్ర చేపట్టి గ్రామాల్లో హిందు దేవతల ఆలయాల పునః ప్రతిష్ఠాపన చేశారని కొనియాడారు. కమలానంద భారతిస్వామి ప్రతిఒక్కరూ గురువు, శివపార్వతులు, సీతారాములను సర్మిస్తూ ఆధ్యాత్మిక సన్మార్గంలో నడిచి ముక్తి మార్గం పొందాలన్నారు. ప్రస్తుత కాలంలో సినీహీరోల ఫొటోలు పెట్టుకొని తప్పుదారిలో నడవడం సరికాదని, ప్రతిఒక్కరూ హైందవ జాతిని చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు శక్తిపీఠం ఆధ్వర్యంలో కమలానంద భారతిస్వామి పాదుక పూజ చేపట్టారు. కార్యక్రమంలో శక్తిపీఠం మార్గదర్శకులు యజ్ఞ నారాయణ పురోహిత్, సభ్యులు మదన్‌మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్, రాములు, మురళీధర్, మహిళా మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో కాంస్య పతకం


భాగ్యలక్ష్మి

ఉప్పునుంతల: మండల కేంద్రానికి చెందిన క్రీడాకారిణి దొంతు భాగ్యలక్ష్మి ఇటీవల అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బెంగళూర్‌లోని కంటిర్వా స్టేడియంలో నిర్వహించిన ఇండియన్ గ్రాండ్ ప్రిక్స్–3 అథ్లెటిక్స్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. మహిళల విభాగం 800 మీటర్ల పరుగు పందెంలో భాగ్యలక్ష్మి ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సొంతం చేసుకుంది. ఇప్పటికే అథ్లెటిక్స్ పోటీల్లో ఆమె పదుల సంఖ్యలో పతకాలు సాధించి అందరి మన్ననలు పొందుతుంది. తాజాగా కాంస్య పతకం సాధించడంపై మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, క్రీడాభిమానులు ఆమెను అభినందించారు.

కరోనాపై జనరల్ ఆస్పత్రిలో మాక్‌డ్రిల్

- అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు


రోగులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

పాలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లా జనరల్ ఆస్పత్రిలో మంగళవారం కరోనాపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ ఆధ్వర్యంలో ఈ మాక్‌డ్రిల్ ఏర్పాటు చేశారు. మొదట పరీక్షలు, స్క్రీనింగ్ పాయింట్స్, రిజల్ట్ పంపిణీ పాయింట్, కోవిడ్ కిట్ జారీ పాయింట్లను పరిశీలించారు. ఆ తర్వాత కరోనా ఓపీ, రిజిస్ట్రేషన్ కౌంటర్, ఆస్పత్రి పరీక్ష చేసుకోవడానికి వచ్చిన అనుమానితులకు ఎలా పరీక్ష చేయాలి, పాజిటివ్ వస్తే తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బంది ప్రాక్టీస్ చేశారు. పరీక్షలు, ఆక్సిజన్ సరఫరా చేస్తున్న పైపులైన్ విధానం, వెంటిలేటర్స్ పనితీరు, ఐసీయూ పడకల ద్వారా అందించాల్సిన వైద్యసేవలపై మాక్‌డ్రిల్ చేశారు. ఈ సందర్భంగా జనరల్ ఆస్పత్రిలో కొంత మందికి అనుమానితులకు ఆర్టీపీసీఆర్ పరీక్షలు చేయగా అందరికీ నెగిటివ్ వచ్చింది. కరోనా వార్డులలో రోగులకు పడకలు, వెంటిలేటర్స్, ఆక్సిజన్ లైన్స్ ఇతర సౌకర్యాలు పరిశీలించి కావాల్సినవి అందుబాటులో ఉంచారు. పీఎస్‌ఏ ఆక్సిజన్ ప్లాంట్, ఎల్ఎంఓ ట్యాంక్ పనితీరు గమనించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ, గైనిక్ హెచ్ఓడీ ప్రొఫెసర్ రాధ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ స్వరాజ్యలక్ష్మీ, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



లింగాల: మండల పరిధిలోని జీల్గుపల్లితండా శివారులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలపై తేనెటీగలు దాడి చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. తండా శివారులోని కుంటకట్టపై 30 మంది వరకు కూలీలు చెట్లపొదలు తొలగింపు పనులు చేస్తున్నారు. ఈ సమయంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో కూలీలు పరుగులు తీశారు. చాలా మందికి కుట్టాయి. బావుడు, గణేష్, రూప్లి, లక్ష్మిపై ఎక్కువ శాతం దాడి చేయడంతో, వారిని చికిత్స నిమిత్తం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మిల్లు యజమానులపై కేసు నమోదు

వనపర్తి క్రైం: బియ్యాన్ని అక్రమంగా భద్రపరిచి.. రీసైక్లింగ్ చేశారని మిల్లు యజమానులపై మంగళవారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీవాసవి రైస్ మిల్లుపై గతంలో కేసు నమోదు చేయగా.. వీటన్నింటిని ఆశీష్ ట్రేడర్స్‌కు అప్పగించారు. అయితే శ్రీ వాసవి రైస్ మిల్లు యజమాని వెంకటరమణ, అశీష్ ట్రేడర్స్ యజమాని వేణు కలిసి అక్రమంగా బియ్యాన్ని భద్రపరిచి, రీస్టైకింగ్ చేశారు. వాటిని రైస్‌మిల్లు నుంచి అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు డీసీఎంను అప్పగించారు. సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ పరీదాభేగం వాటిని పరిశీలించి, నివేదిక ఉన్నతాధికారులకు అందజేశారు. వారి ఫిర్యాదు మేరకు వెంకటరమణ, వేణుపై చీటింగ్ కేసు నమోదు చేశామని పట్టణ రెండో ఎస్ఐ.రాము తెలిపారు.

లారీ ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి

కందనూలు: లారీ ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతిచెందిన సంఘటన నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని నల్లవాగు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. బిజినేపల్లి మండలం కారుకొండతండాకు చెందిన పెంటయ్య నాయక్(65) పని నిమిత్తం నాగర్‌కర్నూల్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళ్తుండగా నల్లవాగు సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెంటయ్యనాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బొలెరో ఢీకొని మరొకరు..

గద్వాల క్రైం: బొలెరో ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం దౌదర్‌పల్లి శివారులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. దౌదర్‌పల్లి కాలనీకి చెందిన గోపాల్(55) బైక్‌పై బయటకు వచ్చాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో గద్వాల– అయిజ రోడ్డు మార్గంలో బొలెరో డ్రైవర్ నిర్లక్ష్యంగా ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

చేనుకు చేవ.. చెరువు మట్టి

అలంపూర్: పంటల సాగులో ప్రధాన పాత్ర భూసారానిదే. భూమిలో శక్తి ఉంటేనే దిగుబడులు ఆశించిన మేరకు వస్తాయి. భూసారం తగ్గితే తెగుళ్లు, పురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచించారు. పెట్టుబడులు పెరగడంతోపాటు పంట నాణ్యత తగ్గుతుందని పేర్కొన్నారు. వీటిని తట్టుకోవడానికి భూసారం అవసరమని వివరించారు.

భూసారం పెంపు ఇలా..

చెరువు పూడిక మట్టి వలన భూమి నాణ్యత పెరుగుతుంది. తేమను నింపుకొనే శక్తిని పెరుగుతంది. నీటి వినియోగ సామర్థ్యంతోపాటు భూమిలోని సారం పెరగడానికి దోహదపడుతుంది. మట్టి యొక్క పీహెచ్ తగ్గి సేంద్రియ కర్బనం, నత్రజని, భూసారం, పొటాష్, సూక్ష్మ పోషకాలు పెరిగి అధిక దిగుబడి వస్తోంది. సేంద్రియ కర్బనం ఎక్కువగా ఉంటే మినరలైజేషన్ ఎక్కువగా జరిగి మొక్కల పెరుగుదల ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం మిషన్ కాకతీయ పేరుతో చెరువుల పునరుద్ధరణ పనులు చేపడుతుంది. రైతులు ఈ మట్టిని పొలాల్లో వేసుకొని కలియదున్ని అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుంది.


చెరువులో ఒండ్రుమట్టి


పొలాల్లో వేసిన చెరువు మట్టి

పండ్ల తోటల్లో..

మామిడి, జామ, దానిమ్మ, బత్తాయి తదితర పంటలకు చెరువు మట్టి వాడకం వలన వేరు వ్యవస్థ బలంగా విస్తరించి ఏపుగా పెరుగుతుంది. దీంతో భూమిలో తేమ నిలుపుకొనే శక్తి పెరుగుతుంది. పాదులలో మల్చింగ్ మాదిరిగా ఉపయోగపడుతుంది.

కిలో చెరువు మట్టిలో ఉండే పోషకాలు (మి.గ్రాములలో..)

నత్రజని	720	మేలు చేసే సూక్ష్మ జీవుల సాంద్రత 308
భాస్వరం	35	
పొటాష్	310	
కర్బనం	0.5	
జింకు	2.8	
బోరాన్	0.8	
గంధకం	18	

కూరగాయల సాగులో..

టమాట, బెండ, వంకాయ తదితర పంటల సాగులో అధిక దిగుబడుల కోసం ఎరువులు ఎక్కువగా వాడటం జరుగుతుంది. దీంతో పెట్టుబడి విపరీతంగా పెరుగుతుంది. కూరగాయలు సాగు చేసే పొలాల్లో ఎకరాకు 8 నుంచి 10 ట్రాక్టర్ల చెరువు మట్టి ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నితే మంచి నాణ్యత గల పంటలు వస్తాయి. పెట్టుబడి తగ్గుతుంది. అంతేకాక తేమ శాతం కూడా తగ్గకుండా ఉంటుంది.

సాగునీరు విడుదల చేసిన కేఎల్ఐ అధికారులు


జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి కేఎల్ఐ ప్రధాన కాల్వకు వస్తున్న సాగునీరు

సాక్షి ఎఫెక్ట్..

కోడేరు: మండలంలోని జొన్నలబొగుడ రిజర్వాయర్ నుంచి కేఎల్ఐ అధికారులు సాగునీరు విడుదల చేశారు. ఈ నెల 6న 'సాగునీరు నిలిపివేత' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో కేఎల్ఐ అధికారులు, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి స్పందించారు. యాసంగిలో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా మంగళవారం కేఎల్ఐ అధికారులు, బీఆర్ఎస్ నాయకులతో మూడో గేటు నుంచి సాగునీరు విడుదల చేయించారు.

మాంటిస్సోరి విద్యార్థికి రాష్ట్రపతి ప్రశంసలు


ఢిల్లీలో తన ప్రాజెక్టును రాష్ట్రపతికి వివరిస్తున్న దీపిక

అలంపూర్: మాంటిస్సోరి పాఠశాల విద్యార్థినిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసించారని పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో సామాన్య వ్యక్తుల సృజనాత్మకతలను గుర్తించడమే లక్ష్యంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్–2023 పైన్ పేరిట ఈ నెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాంటిస్సోరి విద్యార్థిని దీపిక.. సైంటిఫిక్ బ్యాగ్ వలన రైతులకు వర్షాకాలంలో తమ ధాన్యాన్ని ఏ విధంగా నిల్వ చేసుకోవచ్చు అనే అంశంపై తన ప్రదర్శనను రాష్ట్రపతికి వివరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దీపికను గైడ్ టీచర్ మురళి మోహన్‌ను పాఠశాల కరస్పాండెంట్ కేఎస్వీ రవిప్రకాష్, ప్రిన్సిపల్ నాగలక్ష్మి అభినందించారు. ఉపాధ్యాయ బృందం శుభాకాంక్షలు తెలిపారు.

వృద్ధురాలి గొంతు కోసి పుస్తెలతాడు చోరీ

జడ్చర్ల: వృద్ధురాలి గొంతును కత్తితో కోసి మెడలో ఉన్న పుస్తెలతాడును తెంపుకుని ఆమెను రోడ్డు పక్కన నెట్టి ఆటోడ్రైవర్, మరో గుర్తు తెలియని మహిళలు పారిపోయిన సంఘటన జడ్చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దపల్లి సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. మద్దూరు మండలం నందిపాడు గ్రామానికి చెందిన రామకృష్ణమ్మ(65) తల్లి గ్రామమైన జడ్చర్ల మండలం పెద్దపల్లికి వెళ్లేందుకు జడ్చర్లలో రాత్రి 10గంటల ప్రాంతంలో ఆటో ఎక్కింది. ఆటోలో అప్పటికే ఓ మహిళ ఉండగా, రామకృష్ణమ్మ కూడా ఎక్కింది. జడ్చర్ల నుంచి బయలుదేరిన ఆటో బండమీదిపల్లి–పెద్దపల్లి గ్రామాల మధ్యలోకి వెళ్లిన తరువాత ఆటోను ఆపి ఆటోడ్రైవర్, మరో మహిళ కలిసి వృద్ధురాలు రామకృష్ణమ్మ గొంతును కత్తితో కోసి ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడును అపహరించి రోడ్డు పక్కన తోసి పారిపోయారు. రోడ్డున అటుగా వెళ్తున్న వారు రోడ్డు పక్కన పడి ఉన్న వృద్ధురాలును గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన పోలీసులు వృద్ధురాలిను 108 అంబులెన్స్‌లో ఏనుగొండ ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలి పరిస్థితి నిలకడగా ఉందని, ఆమె నుంచి వివరాలు సేకరించి విచారణ చేపడుతున్నామని సీఐ తెలిపారు.

బీసీ కుల గణనకు జై

- ఏపీలో నిర్వహించేందుకు సీఎం వైఎస్ జగన్ కీలక నిర్ణయం



సాక్షి, అమరావతి : కుల గణన చేపట్టాలన్న బీసీ సంఘాల న్యాయమైన డిమాండ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జైకొట్టింది. వెనుకబడిన వర్గాల ఆశల అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. వీరి న్యాయమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవడం ద్వారా సీఎం వారికి నైతిక మద్దతు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ తాజా నిర్ణయంపట్ల బీసీ సంఘాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి. మరోవైపు.. దేశవ్యాప్త జనాభా లెక్కల సేకరణలో బీసీ కులం కాలమ్ చేర్చి కుల గణన చేపట్టాలంటూ కేంద్రాన్ని కోరుతూ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసింది. పైగా ఇప్పుడు రాష్ట్ర పరిధిలో కుల గణనకు సన్నద్ధమైంది. దీనిపై అధ్యయనానికి రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటుచేయాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశించినట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మంగళవారం వెల్లడించారు. త్వరలో మంత్రి వేణు నేతృత్వంలో కమిటీని కూడా ప్రభుత్వం ప్రకటించనుంది. ఇప్పటికే బీసీ కుల గణనకు ముందుకొచ్చిన బిహార్, పంజాబ్, ఒడిశా రాష్ట్రాల్లో ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. అధ్యయన నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన అనంతరం రాష్ట్రంలో బీసీ కుల గణనకు శ్రీకారం చుట్టేలా రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందిస్తుంది. తద్వారా జనాభా లెక్కల సేకరణలో కులం కాలమ్ చేర్చి కుల గణన చేపట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులతో సింగరేణి అధికారుల భేటీ

ఉక్కునగరం: తెలంగాణకు చెందిన సింగరేణి అధికారుల బృందం మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించింది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ముడి సరుకులు, నగదు కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) కోసం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం విదితమే. ఈవోఐకు ఈ నెల 15న గడువుగా నిర్ణయించారు. ఈవోఐలో పాల్గొనేందుకు తెలంగాణ ప్రభుత్వం ఆసక్తి కనబరుస్తుందన్న వార్తల నేపథ్యంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, సుబ్బారావు, బలరాంతో పాటు మరో ఇద్దరు జీఎంలు ఉక్కు పరిపాలన భవనంకు వచ్చారు. ఉక్కు సీఎండీ కాన్ఫరెన్స్ హాల్‌లో స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) వేణుగోపాలరావు, డైరెక్టర్ (కమర్షియల్) డీకే మొహంతి, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జ్ ఏకే బాగ్చీ, మార్కెటింగ్ అధికారులతో సమావేశమై ఈవోఐ విధి విధానాల గురించి చర్చించినట్లు సమాచారం.

అడ్డంగా దొరికినా అడ్డదారిలోనే!

ఆర్బీఐ వారించినా రామోజీ బుద్ధి వంకరే


సాక్షి, అమరావతి: చట్టాలను ఉల్లంఘిస్తూ అక్రమాలకు పాల్పడటంలో తనకు సాటిలేదని చెరుకూరి రామోజీరావు మళ్లీ మళ్లీ నిరూపించుకుంటూనే ఉన్నారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించడమే కాకుండా తన చర్యను నిస్సిగ్గుగా సమర్థించుకునేందుకు బరితెగించడం ఆయనకే చెల్లింది. తటస్థుల ముసుగులో టీడీపీ సానుభూతిపరులతో మాట్లాడిస్తూ మరో నాటకానికి తెర తీశారు. డిపాజిట్ల సేకరణ ముమ్మాటికీ చట్టవిరుద్ధమేనని ఆర్బీఐ కొరడా ఝుళిపించడం, అడ్డంగా దొరికిపోవడంతో కేసు విచారణ ఇంకా కొనసాగుతుండగానే నేరపూరిత కుట్రతో నాడు 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'ను రామోజీ మూసివేశారు. ఇక ఇప్పుడు 'మార్గదర్శి చిట్‌ఫండ్స్' పేరిట రశీదుల రూపంలో అక్రమ డిపాజిట్ల సేకరణకు బరితెగించారు. చందాదారుల సొమ్ముతో అక్రమ ఆర్థిక సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాలతో ఈ అక్రమాల బాగోతం మరోసారి బట్టబయలైంది.

మార్గదర్శివి అక్రమ డిపాజిట్లే...

'మార్గదర్శి ఫైనాన్షియర్స్' పేరిట చెరుకూరి రామోజీరావు అక్రమ డిపాజిట్లు సేకరించారని ఆర్బీఐ తేల్చింది. ఈమేరకు 2006 నవంబరులో కేంద్ర ఆర్థిక శాఖకు లిఖితపూర్వకంగా తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఓ లేఖ ద్వారా వెల్లడించింది. డిపాజిట్ల సేకరణను సమర్థించుకుంటూ రామోజీరావు చేసిన వాదన పూర్తిగా అహేతుకం, చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. ఆదాయపన్ను చట్టం ప్రకారం తమ వ్యాపార సంస్థలన్నీ హిందూ అవిభక్త కుటుంబం (హెచ్‌యూఎఫ్) కిందకు వస్తాయి కాబట్టి ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయవచ్చని, ఆర్బీఐ చట్టంలోని '45 ఎస్' నిబంధన తమకు వర్తించదని రామోజీ అడ్డగోలుగా వాదించారు. దీన్ని ఆర్బీఐ పూర్తిగా తిరస్కరించింది. 'మార్గదర్శి ఫైనాన్షియర్స్' పేరిట వసూలు చేసినవి అక్రమ డిపాజిట్లేనని స్పష్టం చేసింది.

కొత్తగా సేకరించొద్దు.. రెన్యువల్ చేయొద్దు

మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట రామోజీరావు రూ.2,204.42 కోట్లు అక్రమంగా డిపాజిట్లుగా సేకరించారని ఆర్బీఐ వెల్లడించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ తక్షణం డిపాజిట్ల సేకరణను నిలిపివేయాలని ఆదేశించింది. కొత్తగా డిపాజిట్లు సేకరించడం, కాలపరిమితి ముగిసిన పాత డిపాజిట్లు రెన్యూవల్ చేసేందుకు వీల్లేదని తేల్చిచెప్పింది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రామోజీరావు డిపాజిట్ల సేకరణను నిలిపివేశారు. అప్పటికే సేకరించిన రూ.2,204.42 కోట్లను డిపాజిట్‌దారులకు వెనక్కి ఇచ్చేస్తామని ఆర్బీఐకి లిఖితపూర్వకంగా తెలిపారు. విధిలేని పరిస్థితుల్లో తమ మార్గదర్శి ఫైనాన్షియర్స్ సంస్థను మూసివేశారు. నాడు దివంగత వైఎస్సార్ సకాలంలో స్పందించి 2.50 లక్షల మంది డిపాజిట్‌దారులు హక్కులను పరిరక్షించారు.



RESERVE BANK OF INDIA

To Govt. Of Andhra Pradesh, 29.12.2006

Chief General Manager in Charge
D.O.DNBS CO/01.02.007/2006-07 November 30, 2006

Dear Shri Amitabh Verma

Representation of Sri Vundavalli Arun Kumar, M.P. received through Dr. Y.S. Rajasekhara Reddy, Chief Minister, Andhra Pradesh regarding alleged irregularities being committed by Margadarsi Financiers, Hyderabad based HUF.

Please refer to Government's letter F.No 5/94/2006-BO.II dated November 10, 2006 on the captioned subject A Status paper indicating the background in respect of Margadarsi Financiers is given in Annex.

2. In view of the letter under reference received from the Ministry, the Bank had called the representative of the unincorporated body (UIB) of discussion on November 13, 2006 and they were asked to a) Substantiate their stance that they are not covered under Section 45S of the RBI Act, 1934 and b) detail their plans for protection of the interest of the depositors. Pending submission of the replies, the UIB was advised neither to accept any fresh deposit nor renew the maturing deposits forthwith.

మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్ల సేకరణ అక్రమం అని చెబుతూ ఆర్‌బీఐ కేంద్ర ఆర్థిక శాఖకు రాసిన లేఖ... డిపాజిట్ల సేకరణ నిలిపివేయాలి, డిపాజిట్‌దారులకు డిపాజిట్ మొత్తానికి తిరిగి చెల్లించాలని ఆదేశించినట్టు పేర్కొన్న ఆర్‌బీఐ

2006లో ఆర్బీఐ ఏం చెప్పిందంటే..?

- 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'వి కచ్చితంగా అక్రమ డిపాజిట్లే
- నిబంధనలకు విరుద్ధంగా రూ.2,205 కోట్ల డిపాజిట్ల సేకరణ
- డిపాజిట్‌దారులకు తక్షణం డిపాజిట్ మొత్తాన్ని చెల్లించాలి
- కొత్తగా డిపాజిట్ల స్వీకరణ, పాతవి రెన్యువల్ చేయకూడదు

మళ్లీ అక్రమ డిపాజిట్లు సేకరణ

ఆర్బీఐ ఆదేశాలతో మార్గదర్శి ఫైనాన్షియర్స్ దుకాణాన్ని మూసివేసిన రామోజీ ఈసారి మార్గదర్శి చిట్‌ఫండ్స్ పేరుతో అక్రమ డిపాజిట్లకు తెరతీశారు. చందాదారులు పాడిన చిట్టీ మొత్తాన్ని వారికి పూర్తిగా చెల్లించకుండా రశీదుల రూపంలో డిపాజిట్లుగా వసూలు చేశారు. చిట్‌ఫండ్ కంపెనీలు డిపాజిట్లు వసూలు చేయడం చిట్‌ఫండ్ చట్టం -1982కు విరుద్ధం. మార్గదర్శి బ్రాంచి కార్యాలయాల నుంచి అక్రమ డిపాజిట్లను సేకరించి హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి తరలించారు. అక్కడ నుంచి తమ అనుబంధ సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, మార్గదర్శి చిట్‌ఫండ్స్(తమిళనాడు)–చెన్నై, మార్గదర్శి చిట్‌ఫండ్స్(కర్ణాటక)–బెంగళూరులలో అక్రమ పెట్టుబడులు పెట్టారు. ముంబైలోని మ్యూచ్‌వల్ ఫండ్స్ కంపెనీలు, షేర్ మార్కెట్లో కూడా అక్రమ పెట్టుబడులుగా మళ్లించారు. ఇలా తన చేతి సొమ్ము రూపాయి పెట్టకుండా చందాదారుల కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టి ఆస్తులు కూడగట్టారని స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారుల సోదాల్లో వెల్లడైంది.



A LETTER FROM
RBI (Centeral Office) MUMBAI
to A.P Government

Copy of of letter No. DNBS.CO. 4210/01.02.06-2007 dated 29th December, 2006 of from Sri P. Krishnamurthy, Chief General Manager-in-Charge, Reserve Bank of India, Central Office, Mumbai addressed to Sri Paul Bhuyan, IAS, Special Chief Secretary to Government, Home Department, Government of Andhra Pradesh, A-Block, 3rd Floor Secretariat, Hyderabad.

Dear Sir,

Please refer to your letter No. 37008/General.B/A2/2006-1 dated December 19, 2006 requesting certain information / documents etc. on Margadarsi Financiers, Hyderabad.

2. As you may be aware, the Reserve Bank of India draws its powers for regulation and supervision over the non-banking financial companies (NBFCs) from the provisions of Chapter III B of the Reserve Bank of India Act, 1934. These powers include registration of NBFCs, inspecting their business, calling for information, calling for returns/statements on deposits and issuing directions. However, the Act does not provide for the Reserve Bank to issue directions. However, the Act does not provide for the Reserve Bank to issue directions or exercise other regulatory and supervisory powers as regards unincorporated bodies (UIBs) such as Margadarsi Financiers which is stated to belong to a Hindu Undivided Family (I 31 Since HUFs are not falling within the definition of a NBFC non-banking Insitution under Chapet III B of the RBI Act, 1934.

డిపాజిట్ దారుల ప్రయోజనాల పరరక్షణ కోసం సీఐడీ ద్వారా తగిన చర్యలు రాష్ట్ర ప్రభుత్వమే తీసుకోవాలని ఆర్‌బీఐ రాసిన లేఖ

చర్యలు తీసుకోవాల్సింది ప్రభుత్వమేనన్న ఆర్బీఐ

నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లను సేకరించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సింది రాష్ట్ర ప్రభుత్వమేనని ఆర్బీఐ 2006లోనే స్పష్టం చేసింది. మార్గదర్శి ఫైనాన్సియర్స్ అక్రమ పెట్టుబడుల అంశంపై నాడు ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కేంద్ర ఆర్థిక శాఖ, ఆర్‌బీఐకి ఫిర్యాదు చేశారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ద్వారా ఆర్బీఐ దృష్టికి తేవడంతో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది. డిపాజిట్‌దారుల ప్రయోజనాలకు కాపాడాల్సిన బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేసింది. అక్రమ డిపాజిట్లు వసూలు చేసే ఆర్థిక సంస్థలపై చర్యలు తీసుకునే యంత్రాంగం ఆర్బీఐకి ప్రత్యేకంగా లేదని పేర్కొంది. ఆ తరహా ఆర్థిక నేరాలను కట్టడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాల వద్ద సీఐడీ విభాగం ప్రత్యేకంగా ఉందని ఆర్బీఐ ప్రస్తావించడం గమనార్హం. ఆమేరకు ఏపీ ప్రభుత్వం కూడా 1999 రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించింది. నాడు ఆర్బీఐ ఆదేశాలతోనే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై చర్యలు చేపట్టింది. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక మోసాలపై అదే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటోంది. సోదాలు నిర్వహించి అక్రమాలు జరిగినట్లు వెల్లడి కావడంతో సీఐడీ కేసు నమోదు చేసింది. ఏ–1గా చెరుకూరి రామోజీరావు, ఏ–2గా చెరుకూరి శైలజపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

'కల్తీ' కల్లోలం!

▶ మొదటి పేజీ తరువాయి

108 అంబులెన్స్‌లో బంధువులు అతడిని జిల్లా జనరల్ ఆస్పత్రిలో చేర్చారు. ఈ క్రమంలో అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఐసీయూలో చికిత్స పొందుతూ ఆశన్న తెల్లవారుజామున 1.15 గంటల ప్రాంతంలో మృతి చెందాడు. వైద్యులు సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. అతడి తమ్ముడు బెంగళూరు నుంచి వచ్చేసరికి సమయం పట్టడంతో మంగళవారం దహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విషయాన్ని ఆస్పత్రి వర్గాలు, ఎక్సైజ్‌శాఖ గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మరో ఇద్దరు ఐసీయూలో..

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఐసీయూలో మరో ఇద్దరు కల్తీ కల్లు బాధితులు చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. మహబూబ్‌నగర్ పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన విష్ణుబాబు భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌లో పోస్టల్ శాఖలో ఏబీపీఎంగా చేస్తున్నాడు. ఆయనతో పాటు దొడ్డలోనిపల్లి గ్రామానికి చెందిన రేణుక ఐసీయూలో చికిత్స పొందుతోంది.



మృతుడు ఆశన్న

విష్ణుబాబుకు వైద్యులు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తుండగా.. పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. దొడ్డలోనిపల్లికి చెందిన రేఖతో పాటు మరో ఆరుగురికి సాధారణ వార్డులో చికిత్స అందిస్తున్నట్లు తెలిసింది.

ఆల్ఫ్రాజోలం మోతాదులో తేడా వల్లేనా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా మందు కల్లు విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. కల్లులో ప్రధానంగా నిషేధిత మత్తు పదార్థం ఆల్ఫ్రాజోలంను కలుపుతున్నారు. అయితే మోతాదులో తేడా రావడం వల్లే బాధితులు పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రిలో అడ్మిట్ అయిన అందరిలో మెడ తిమ్మిర్లు, చేతులు వణకడం, తలవెనక్కి వాలడం, నాలుక బయటకు రావడం, నత్తి, శరీరంలో చలనం లేకపోవడం వంటి లక్షణాలు కన్పిస్తున్నాయి.

ఎవరూ కల్లు తాగి అడ్మిట్ కాలేదు..

కల్తీ కల్లు తాగి ఆస్పత్రిలో ఎవరూ అడ్మిట్ కావడం లేదు. కేవలం వింత వింత ప్రవర్తనతో పాటు ఫిట్స్ ఇతర సమస్యలతో వస్తున్నారు. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు దాదాపు 25 మంది వరకు ఇలాంటి లక్షణాలతో అడ్మిట్ అయ్యారు. వీరిలో కొందరికి ఊపిరితిత్తుల సమస్యతో పాటు ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నట్లు నిర్ధారించాం. అందరికీ కావాల్సిన చికిత్స అందించి డిశ్చార్జి చేయడం జరుగుతుంది.

– డాక్టర్ రామకిషన్, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్

ఐదురోజులుగా ఆస్పత్రిలోనే..



మహబూబ్‌నగర్ పట్టణంలోని మోతీనగర్ ప్రాంతానికి చెందిన ఇంద్రజ ఈ నెల 7న కల్లు తాగి అస్వస్థతకు గురికావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయింది. ఆమె మాట్లాడలేని స్థితిలో ఉంది. సపర్యలు చేస్తున్న ఆమె తల్లి మాట్లాడుతూ.. 'ఐదు రోజుల నుంచి ఇక్కడే ఉంటున్నాం..ఇంద్రజకు కల్లు తాగే అలవాటు ఉంది.. పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడంతో ఆస్పత్రికి తీసుకొచ్చాం..' అని తెలిపింది.

రాష్ట్రంలో భారీగా కరోనా కేసులు నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో జ్వరాలు, ఇన్‌ఫ్లుయెంజా కేసులు పెరగటం, తదితర కారణాలతో కరోనా కేసులు కూడా పెరుగుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. మంగళవారం 6,813 మందికి పరీక్షలు నిర్వహించగా..వారిలో 40 మంది కరోనా బారిన పడ్డారు. 196 మంది ఐసోలేషన్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

కమ్యూనిస్టు నేత వెంకటయ్య కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: సీనియర్ కమ్యూనిస్టు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని వెంకటయ్య (98)మంగళవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆయన ప్రముఖ కమ్యూనిస్టు బొమ్మగాని ధర్మభిక్షం సోదరుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ తండ్రి. వెంకటయ్య భౌతికకాయాన్ని బుధవారం ఉదయం 8 గంటల వరకు ఎల్బీనగర్ లోని ఆయన కుమారుడు నాగభూషణం నివాసంలో సందర్శనార్థం ఉంచుతారు. అనంతరం సూర్యాపేటకు తరలించి మధ్యాహ్నం రెండు గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పూలే ఆశయాలను కొనసాగించాలి



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కలెక్టర్, ఎస్పీ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సమాజంలోని ప్రతిఒక్కరు మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాలకనుగుణంగా నడుచుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఆయన కలెక్టర్ రవినాయక్, ఎస్పీ కె.నరసింహతో కలిసి మహబూబ్‌నగర్‌లోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశంలో రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్లు రావడానికి మూలకారకుడు పూలే అన్నారు. అట్టడుగు వర్గాల వారు రిజర్వేషన్ల ద్వారా మాత్రమే సంపన్న వర్గాలకు సమానంగా రాగలుగుతారని, అన్నిరంగాల్లో రిజర్వేషన్లు కల్పించినప్పుడే ఇది సాధ్యమవుతుందన్న మహనీయుడు జ్యోతిబాపూలే అని వివరించారు. అణగారిన వర్గాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ జాతులు ఉన్నత స్థాయిలో ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఏ రాష్ట్రంలో అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణలో ఉన్నాయని, బడుగు, బలహీన వర్గాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ గణేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇందిర, కౌన్సిలర్లు రామ్‌లక్ష్మణ్, వెంకటేష్, షబ్బీర్, బీసీ సంఘం నాయకుడు ప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రామన్‌పాడుకు నీటి నిలిపివేత

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో మంగళవారం 1,019 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. సాగుకోసం ఎలాంటి నీటిని విడుదల చేయడం లేదు. కేవలం తాగునీటి అవసరాల కోసం 20క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

తుది దశకు వంతెన పనులు

మన్నెవు వాగుపై ముమ్మరంగా వంతెన నిర్మాణం

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట, చిన్నవడ్డెమాన్ గ్రామాల మధ్యన మన్నెవు వాగుపై వంతెన నిర్మాణం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనికోసం ప్రభుత్వం రూ.3.70 కోట్లు మంజూరు చేసింది. 73 మీటర్ల పొడవు, మూడుమీటర్ల ఎత్తుతో నిర్మాణం చేపట్టేందుకు అధికారులు డిజైన్ చేశారు. గత సంవత్సరం ఈ పనులను అధికారులు ప్రారంభించారు. ఏడు పిల్లర్ల నిర్మాణం, స్లాబ్ పనులు పూర్తి చేశారు. సైడ్‌వాలు పనులు కొనసాగిస్తున్నారు. వచ్చే నెల చివరినాటికి నిర్మాణం పూర్తిచేసి అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు. దీంతో దేవరకద్ర, ఆత్మకూర్ పట్టణాలకు రాకపోకలు మెరుగుపడనున్నాయి.

తప్పనున్న ఇబ్బందులు..

చిన్నచింతకుంట, చిన్నవడ్డెమాన్ గ్రామాల మధ్యలో ఉన్న మన్నెవు వాగుపై చిన్న పురాత వంతెన ఉంది. దీంతో దేవరకద్ర, ఆత్మకూర్ పట్టణాలకు రాకపోకలకు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వర్షాలకు వరదలు వచ్చి ఈ వంతెనపై వాగు ఉధృతంగా పారుతుండేది. దీంతో వాగు వద్ద పూర్తిగా రాకపోకలు నిలిచిపోయేవి. మండలంలోని చిన్నవడ్డెమాన్, పెద్దవడ్డెమాన్, నెల్లికొండి, లాల్‌కోట, పల్లమరి, బండ్రపల్లి, పర్దిపూర్, దమగ్నాపూర్, సీతారాంపేట గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఎదులాపూర్, చిన్నచింతకుంట, మద్దూర్, అల్లిపురం గ్రామాల ప్రజలు దేవరకద్ర, అలాగే జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్ల చుట్టూ తిరిగి చేరుకోవాల్సి వచ్చేది. అంతేకాక కొందరు వాహనదారులు వరదల ఉధృతికి వాగులోపడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ సమస్యపై మండల ప్రజలు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం వంతెన నిర్మాణం పూర్తయితే ఇబ్బందులు తీరనున్నాయి.



మన్నెపు వాగుపై నిర్మిస్తున్న వంతెన

త్వరగా పూర్తి చేయాలి



మన్నెవాగుపై చిన్నవంతెన వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవాళ్లం. వర్షాకాలంలో వరదలు వచ్చి 15 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. మండల కేంద్రానికి, ఆత్మకూర్ వెళ్లలేక పోయేవాళ్లం. చదువుకునేందుకు వెళ్లలేక విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. వంతెన నిర్మాణం త్వరగా పూర్తయితే మా ఇబ్బందులు తీరుతాయి.

– చంద్రశేఖర్, పెద్దవడ్డేమాన్, గ్రామం

సంతోషంగా ఉంది..



వర్షాకాలంలో వరదలకు మన్నెపు వాగు ఉధృతంగా పారి వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేది. గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయేవి. దీంతో ఎదులాపూర్, చిన్నచింతకుంట, మద్దూర్ గ్రామాల ప్రజలు ఇబ్బందిపడేవారు. వంతెన నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– హేమవతి, ఎదులాపురం సర్పంచ్

తొందరలోనే అందుబాటులోకి..



మన్నెపు వాగుపై వంతెన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం.

– నరేందర్, డిప్యూటీ డీఈ, ఆర్అండ్‌బీ

మాయమాటలు చెప్పేవారిని నమ్మొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

చిన్నంబావి: మాయమాటలు చెప్పే వారిని నమ్మవద్దని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును ఉద్దేశించి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయనతో పాటు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీరం మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేని కొందరు సోషల్ మీడియా ద్వారా అసత్య ఆరోపణలు చేస్తున్నారని, అలాంటి వారిపట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీని వ్యతిరేకించి సీఎం కేసీఆర్‌ను నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని, వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఉమ్మడి జిల్లాలోని 98 జీఓ నిర్వాసితులను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించిందని, ఆ మేరకు అన్ని విధాలుగా ఆదుకునేలా కృషిచేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్సీ చల్లా మాట్లాడుతూ హర్షవర్ధన్‌రెడ్డి తన సోదరుడు అని, ఆయన కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. మార్కెట్ యార్డు చైర్మన్ కిషన్‌నాయక్, చిన్నంబావి ఎంపీపీ సోమేశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకట్రావమ్మ, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఈదన్నయాదవ్, సింగిల్ విండో చైర్మన్ నర్సింహారెడ్డి, మద్దిలేటి, ఉమ్మడి మండలాల వ్యవహారాల బాధ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు యూనిక్ ఐడీకార్డుల అందజేత

నాగర్‌కర్నూల్: ట్రాన్స్ జెండర్లకు యూనిక్ ఐడీ కార్డులను మంగళవారం కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆయన ఛాంబర్‌లో అందజేశారు. httpr://tranrfender.dorje.gov.in ద్వారా పేర్లు నమోదు చేసుకున్న వారికి అందజేయనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. ప్రతి దరఖాస్తుదారుకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ నంబర్ ఇచ్చి దీని ద్వారా స్కాలర్‌షిప్‌లు, స్కిల్‌డెవలప్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్, కాంపోజిట్ మెడికల్ హెల్త్ ఇన్సూరెన్స్, టీజీ సర్టిఫికెట్, గుర్తింపు కార్డు వంటి సంక్షేమ పథకాలను అందించాలని కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు సమాజంలో ఎలాంటి వివక్షకు గురికాకుండా స్వయం శక్తితో రాణించేలా వారి కులాల ఆధారంగా స్కిల్ డెవలప్‌మెంట్‌తో జీవనోపాధి కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నుంచి అందజేసే రూ.50 వేల సదుపాయంతో మంచి వ్యాపారాలు చేసుకుని అభ్యున్నతి సాధించాలని కలెక్టర్ ఈ సందర్భంగా వారిని కోరారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మి, సఖి కోఆర్డినేటర్ సునీత, ట్రాన్స్‌జెండర్స్ మల్లికామహాలక్ష్మి, సుజిత, రాములమ్మ, నికిత, సాహి, ట్రాన్స్‌జెండర్ ప్రాజెక్టు మేనేజర్ విజయలక్ష్మి, కౌన్సిలర్ పద్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్లకు ఐడీ కార్డులను అందజేస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

జోగుళాంబకు స్వర్ణహారం బహూకరణ



డైరెక్టర్ జనరల్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు



అమ్మవారికి సమర్పించిన బంగారు హారం

జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ అమ్మవారికి ఓ భక్తుడు 24 గ్రాముల బంగారుహారం ఇచ్చినట్లు దేవస్థానం ఈఓ పురేందర్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ రంగనాథ్ తెలియజేశారు. హైదరాబాద్‌కు చెందిన గూడెపల్లి మేఘ శివకన్య అనే భక్తుడు రూ.1.59లక్షల విలువ చేసే బంగారు హారాన్ని అమ్మవారికి సమర్పించినట్లు చెప్పారు. విశేష సందర్భాల్లో మాత్రమే అమ్మవారికి వీటిని అలంకరిస్తామని దేవస్థానం వారు తెలియజేశారు.

ఆలయంలో ఐ.పీ.ఎస్ అధికారి

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాలను మంగళవారం ఏపీకి చెందిన డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో సాదరస్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదా లు అందజేసి శేష వస్త్రాలతో వారిని సత్కరించారు.

వైభవంగా యోగానందస్వామి ఆరాధనోత్సవం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ దేవస్థానంలో మంగళవారం దత్తాత్రేయ రామావధూత శ్రీలక్ష్మీ నర్సింహా యోగానంద స్వామివారి ఆరాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం దేవస్థానంలో స్వామివారి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే పూజా కార్యక్రమాలు చేపట్టారు. గతంలో స్వామివారు మన్యంకొండలో తపస్సు చేయడంతోపాటు ఆయన వాడే పాదుకలను, కమండలాన్ని ఇక్కడ్నే వదిలి వెళ్లిపోయారు. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవంలో దేవస్థానం మండపంలో పాదుకలు, కమండలాన్ని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పంచామృతాభిషేకం, రామసహస్ర నామార్చన, మహానివేదన, హారతి, మహాపుష్పయాగం తదితర పూజలు జరిపించారు. స్వామివారి కమండలాన్ని రకరకాల పూలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి పూలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, అళహరి రామకృష్ణ, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



యోగానంద స్వామివారి కమండలానికి పూజలు చేస్తున్న అళహరి మధుసూదన్‌కుమార్